


- ఇష్టారాజ్యంగా కూల్చివేతల కలకలం
- వ్యాపారస్తులకు బెదిరింపులు ?
- కమిషనర్‌ను పట్టించుకోని వ్యాఖ్యలు
- ఎంపిక చేసిన కూల్చివేతలపై ఆరోపణలు




# టీపీవో ఇష్టారాజ్యం!

## అమీన్‌పూర్ సర్కిల్‌లోని టీపీవో పవన్‌పై స్థానికుల ఆగ్రహం

**రామచంద్రపురం, మార్చి 28 (సిరిన్యూస్): నచ్చిన వారికి ఒక న్యాయం...నచ్చని వారికి మరో న్యాయం అన్న చందంగా అధికారుల పనితీరు కనిపిస్తోంది. తాను చెప్పిందే వేదంగా...ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా తాను చేసిందే కరెక్టు అన్న విధంగా వ్యవహరించడంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. ఇదంతా అమీన్‌పూర్ సర్కిల్ లోని టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ పై వెల్లువెత్తుతున్న ఆరోపణలు..అమీన్ పూర్ సర్కిల్ లో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న పవన్ వ్యవహార శైలి తీవ్ర వివాదాస్పదంగా మారింది. అతి ఉత్సాహంతో ఇష్టారాజ్యంగా కూల్చివేతలు చేపడుతున్నారని వ్యాపారస్తులు, స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. నియమాలు ఒకలా ఉండగా, అమలు మాత్రం మరోలా జరుగుతోందని ప్రజలు మండిపడుతున్నారు.**

### ఉదయం నుంచి కూల్చివేతలు...

రామచంద్రపురం పరిధిలోని బీరంగూడ కామన్ నుంచి రైల్వే ట్రాక్ ఇరువైపులా శనివారం ఉదయం నుంచే కూల్చివేతలు చేపట్టారు. ఒక వైపు 100 ఫీట్ వరకు మార్కింగ్ చేసిన అధికారులు, మరోవైపు మాత్రం 100 ఫీట్ దాటి కూల్చివేతలు చేపట్టడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ఒకే ప్రాంతంలో రెండు విధాలుగా చర్యలు ఎందుకు అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పారదర్శకత లేకుండా కూల్చివేతలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వ్యాపారస్తులకు బెదిరింపులు?...

కూల్చివేతల సమయంలో వ్యాపారస్తులను బెదిరిస్తూ "మీరు ఎలా లోపలికి వెళ్తారో చూస్తా", "అడ్డంగా గోడలు కడుతా" అంటూ హెచ్చరికలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. అధికార భాషను దాటి బెదిరింపులకు దిగడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కమిషనర్‌ను పట్టించుకోలేదా?...

వ్యాపారస్తులు కమిషనర్‌తో మాట్లాడామని చెప్పినప్పటికీ టీపీఓ పవన్ "ఎవరు ఆ కమిషనర్? నాకేంటి సంబంధం అతనితో?" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు అధికార వ్యవస్థపై నిర్లక్ష్యాన్ని సూచిస్తున్నాయని వ్యాపారులు మండిపడుతున్నారు. అన్నీ తానే అన్న రీతిగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### గ్రీనరీ తొలగింపు.. కబ్జాలపై మౌనం?

వ్యాపారస్తులు గ్రీనరీ కోసం కొన్నిచోట్ల మొక్కలు పెట్టుకుంటే వాటిని తొలగించినప్పటికీ పక్కనే ఉన్న అక్రమ కబ్జాలను మాత్రం వదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రీనరీ తొలగింపు వేగంగా జరిగితే, కబ్జాలపై చర్యలు ఎందుకు లేవని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తనకు నచ్చిన విధంగా వ్యవహరించడం సరి కాదన్నారు.

### డబ్బులు ఇచ్చిన వారిని కాపాడారా?

డబ్బులు ఇచ్చిన వారిని కాపాడుతూ, సాధారణ వ్యాపారులపైనే చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వైన్స్ షాపుల ముందు ఉన్న నిర్మాణాలను ముట్టుకోకుండా వెళ్లిపోవడం మరింత అనుమానాలకు కారణమవుతోంది. డబ్బులు ముట్టజెప్పని వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

### ఎంపిక చేసిన కూల్చివేతలపై విమర్శలు

ఒకే ప్రాంతంలో కొందరిపై కఠిన చర్యలు, మరి కొందరిపై మౌనం పాటించడం అధికారుల వ్యవహారంపై అనుమానాలు పెంచుతోంది. నియమాలు అందరికీ సమానంగా అమలు చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. టీపీఓ పవన్ చర్యలపై వ్యాపారులు, స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అధికార దుర్వినియోగం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.




### విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిజానిజాలు వెలికి తీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా కూల్చివేతలు.. బెదిరింపులు కమిషనర్‌ను పట్టించుకోని వ్యాఖ్యలు..ఎంపిక చేసిన చర్యలు, టీపీఓ పవన్ వ్యవహారం ఇప్పుడు పటాన్‌చెరు పరిధిలో హాట్ టాపిక్‌గా మారింది.



**ఈ విషయమై టి పి ఓ పవన్‌ను వివరణ కోరడానికి సిరి న్యూస్ ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. అలాగే కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను సైతం వివరణ కోరడానికి ప్రయత్నించగా స్పందించలేదు.**






